క్లుప్తంగా

సందడిగా పాఠశాలలు..



బాల్కొండ : సోమవారం విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బడి గంట మోగింది. దీంతో ఉదయం నుంచే పాఠశాలలు విద్యార్థులతో సందడిగా మారాయి. ప్రభుత్వ పాఠశాలల్లో అంగన్ వాడీ కేంద్రాలను నుంచి విద్యార్థులను చేర్పించారు. గ్రామాల్లో బడి బాట నిర్వహించడం వల్ల బడి ఈడు పిల్లలు బడిలో అడ్మిషన్లు తీసుకున్నారు. మొదటి రోజు కావడంతో హాజరు తక్కువగానే నమోదైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

అందుబాటులో వరి విత్తనాలు

బాల్కొండ : ముప్కాల్ మండలం రెంజర్ల సహకార సంఘంలో వరి విత్తనాలను అందుబాటులో ఉన్నాయని సహకార సంఘం చైర్మన్ గంగాధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంటీయూ 1010 రకానికి చెందిన వడ్లు 25 కేజీలు రూ. 885, కేఎస్ఎం 1638 రకం 25 కేజీలు రూ. 885, బీపీటీ 5204 రకం 25 కేజీలు రూ.890 అన్నారు.

రూ.లక్ష కోసం దరఖాస్తుల ఆహ్వానం

బోధన్ రూరల్ (బోధన్) : తెలంగాణ ప్రభుత్వం కుల వృతుల కోసం అందిస్తున్న రూ.లక్ష సాయం కోసం బీసీ కులవృత్తుల లబ్ధిదారులు ఈనెల 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ బుద్దె సావిత్రి అన్నారు. రూ.లక్షను బ్యాంక్‌కు సంబంధం లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు ఎంపీడీఓ ఆఫీస్‌లో జిరాక్స్ అందించాలన్నారు.

రహదారిపై కూలిన వృక్షం



నవీపేట : రెండు రోజుల కిందట వీచిన అకాల ఈదురు గాలులకు నవీపేట–పోతంగల్ గ్రామాల మధ్య రహదారిపై వృక్షం నేలకొరిగింది. ఈ రహదారి వెంబడి జన్నెపల్లి, నాళేశ్వర్, బినోల, నందిపేట గ్రామాలకు నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. రోడ్డుపై అడ్డంగా పడిన చెట్టు కొమ్మలు రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయి. రోడ్డు భవనాల శాఖ అధికారులు స్పందించి కూలిక వృక్షం కొమ్మలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నియామకం



ఎడపల్లి(బోధన్) : బీజేపీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా బోధన్ నియోజకవర్గం మహిళా మోర్చా కన్వీనర్ జంలం సర్పంచ్ రాజ్యలక్ష్మిని నియమించారు. బోధన్‌లో సోమవారం మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి సులోచన, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షులు ప్రవళిక శ్రీధర్ రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి స్రవంతి రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



వేల్పూర్ : వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామంలో కొంతం రవికుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడంతో వారి కుటుంబానికి ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్‌రెడ్డి సోమవారం రూ. 10 వేల ఆర్థికసాయం చేశారు. రవికుమార్ మరణించగా భార్య, ముగ్గురు కుమార్తెలు కుటుంబ ఆధారాన్ని కోల్పోయారు. దాంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. చిన్నారుల చదువుకు, ఉపాధికి సహకారం అందిస్తానన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



రుద్రూర్ : రుద్రూర్ మండలం కొండాపూర్ గ్రామంలో నీటి సమస్య తలెత్తడంతో సోమవారం ట్యాంకర్‌ల ద్వారా నీటిని సరాఫరా చేశారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభాలు పడిపోయి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో సోమవారం నీటి కోసం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందుల పడ్డారు. సమస్యను గుర్తించిన సర్పంచ్ భాగ్య భూషన్ ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు.

ఉత్సాహంగా 2కే రన్

- పరుగులో పాల్గొన్న ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి
- బోధన్‌లో ప్రారంభించిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ పద్మ శరత్ రెడ్డి

ఆర్మూర్ : తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో వందేళ్లలో జరగాల్సిన అభివృద్ధి పదేళ్లలో జరిగిందని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా నుంచి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 2కే రన్‌ను సోమవారం నిర్వహించారు. 2కే రన్‌కు జెండా ఊపి ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విమర్శించే అభివృద్ధి నిరోధకులకు గట్టిగా బుద్ధి చెప్తామన్నారు. ఈ 2–కే రన్‌లో ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత, వైస్ చైర్మన్ షేక్ మున్ను, నందిపేట, ఆర్మూర్ జెడ్పీటీసీ సభ్యులు యమునా ముత్యం, సంతోష్, మాక్లూర్, ఆర్మూర్ ఎంపీపీలు మాస్త ప్రభాకర్, పస్క నర్సయ్య, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సురేష్, పోలీసు అధికారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఆర్మూర్ పట్టణంలో 2కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

బోధన్‌లో..

బోధన్‌టౌన్(బోధన్) : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం బోధన్‌లో 2 కే రన్ నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద జెండా ఊపి మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి ర్యాలీని ప్రారంభించారు. ఈ రన్ అంబేద్కర్ చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్ శక్కర్‌నగర్ చౌరస్తా మీదుగా అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకుంది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీస్‌తో ప్రజలకు పోలీసుల మీద ఉండే భయం పోయిందన్నారు. ఈ 2 కే రన్‌లో ఆర్డీవో రాజేశ్వర్, ఏసీపీ కిరణ్‌కుమార్, ఎమ్మెల్యే సతీమణి అయేషా ఫాతిమా, పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, జెడ్పీ వైస్ చైర్మన్ రజితా యాదవ్, సీఐలు ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్‌రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బోధన్‌లో 2కే రన్‌లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

బోధన్ : రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో చేస్తు సోమవారం పట్టణ కేంద్రంలోని ఆర్డీవో ఆఫీసులో ఏవో ముంతాజుద్దీన్‌కు ఏఐకెఎంఎస్ మండల ప్రతినిధుల బృందం వినతిపత్రం అందించారు. ఏఐకేఎంఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దార్నె భూమన్న, గంపల పోశెట్టి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు రూ. లక్ష పంట రుణమాఫీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలను అరికట్టాలని, యాసంగిలో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి పుట్ట వరదయ్య, నాయకులు దేవిదాస్, ఎస్‌కే నజీర్, గంగారాం, సాయిలు పాల్గొన్నారు.



అధికారికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కల్తీ విత్తనాలు అమ్మకుండా చూడాలి

మాక్లూర్ : దుకాణాల్లోనికి కల్తీ ఎరువులు, విత్తనాలు రాకుండా చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం ఏఐకేఎంఎస్ నాయకులు మండల కేంద్రంలో తహసీల్దార్ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్, శివకుమార్, దుర్గాప్రసాద్, నవీన్‌కుమార్, కృష్ణంరాజు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పింఛన్ ఇప్పించండి సారూ..

సుభాష్‌నగర్ : బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామానికి చెందిన విజయ, శేఖర్ దంపతుల కుమారుడు లోకేష్ (8) పింఛన్ ఇప్పించాలని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. లోకేష్‌కు చిన్నప్పటి నుంచి కాళ్లు, చేతులు పని చేయడం లేదు. కలెక్టరేట్‌కు కూడా తన తండ్రి ఎత్తుకుని తీసుకొచ్చాడు. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు చేయడం లేదు. సైట్ ఓపెన్ కావడం లేదని అధికారులు కాలయాపన చేస్తున్నారు. సైట్ ఓపెన్ అయిన సమయంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్తూ పంపిస్తున్నారని లోకేష్ తండ్రి శేఖర్ పేర్కొన్నాడు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, వెంటనే పింఛన్ మంజూరు చేయాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.



బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న కలెక్టర్

భక్తుల కొంగు బంగారం కొండాపురం ఎల్లమ్మ

నందిపేట్(ఆర్మూర్): ఎల్లమ్మ పాదాలు తాకిన పవిత్ర నేల. రాముడు వనవాసంలో సంచరించిన పుణ్యభూమి. ఎంతో చారిత్రాత్మక నేపథ్యం ఉన్న కుద్వాన్‌పూర్ ఎల్లమ్మ ఆలయం భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతుంది. ఆలయ ప్రాశస్త్యం తెలిసిన వివిధ రాష్ట్రాల భక్తులు ఇక్కడికి వచ్చి పూజలు చేసి అమ్మవారిని దర్శించుకుంటారు. యుగాల చరిత్ర గల ఎల్లమ్మ ఆలయం ప్రాముఖ్యత ఎంతగానో ఉంది.

అమ్మ పాదాలతో వెలసిన ఆలయం..

అది కృత యుగం. జమదగ్ని మహర్షి బార్య రేణుక మాత. వీరికి పరుశ రాముడు కుమారుడు. కొంత కాలంపాటు పరుశురామునికి అతని తండ్రి జాడ తెలియకూడదని ఆజ్ఞ ఉంటుంది. పరశరాముడు పసితనంలో తన వయసు వారితో కలిసి ఆడుకునే సమయంలో తన తండ్రి ఎవరో చెప్పాలని తోటి స్నేహితులు అడుగుతారు. దీంతో పరుశరాముడు తన తల్లి దగ్గరికి వెళ్లి తన తండ్రి జాడ తెలుపాలని కోరుతాడు. కాని తల్లి రేణుక మాత ఆ వివరాలను తెలుపడానికి నిరాకరిస్తుంది. దీంతో కోపాద్రిక్తుడైన పరుశురాముడు తన గొడ్డలితో తల్లిని మూడు బాగాలుగా నరుకుతాడు. తలభాగం మహారాష్ట్రలోని మాహోర్, మొండెం నిర్మల్ జిల్లాలోని దిలావర్‌పూర్, పాదాలు నిజామాబాద్ జిల్లాలోని నందిపేట మండలం కుద్వాన్‌పూర్ గ్రామాలలో పడ్డాయని చారిత్రాత్మిక ఇతిహాసం. అమ్మవారి పాదాలు పడడంతో ఇక్కడ ఆలయం వెలిసింది.



కుద్వాన్‌పూర్‌లోని ఎల్లమ్మ ఆలయం

కోదండపురంగా నామకరణం..

వనవాస సమయంలో రాముడు, సీత ఈ ప్రాంతం గుండా వెళ్లారని భక్తుల విశ్వాసం. ఈ సమయంలో సీతమ్మకు దాహం వేసింది. చుట్టు పక్కల నీరు లేకపోవడంతో శ్రీరాముడు కోదండం అనే బాణాన్ని తీసి పెద్ద బండరాయిపై వదులుతాడు. దీంతో బండ రెండుగా చీలిపో యి జలదార వస్తుంది. ఈ నీటితో సీతమ్మ దాహం తీర్చుకుంటుంది. ఈ ప్రదేశంలో ఏర్పడిన కోనేరు ఆలయానికి దక్షిణ బాగాన ఉంటుంది. శ్రీ రాముడు కోదండ బాణం వేయడంతో ఈ ప్రాంతానికి కోదండపురంగా పేరు వచ్చిందని స్థానికులు చెప్పుకుంటారు. క్రమేపి కొందాపురం కుద్వాన్‌పూర్‌గా మార్పు చెందింది.

సంక్షిప్తం

మహిళ కడుపులో కణతి తొలగింపు

భీమ్‌గల్ : భీమ్‌గల్‌లోని శ్రీ శివసాయి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో సోమవారం అరుదైన శస్త్ర చికిత్స చేశారు. పట్టణ కేంద్రానికి చెందిన జమున(30) గత నాలుగేళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. ఆస్పత్రిలో ఆమెకు చికిత్స చేసి ఆమె కడుపులో 6 కిలోల వరకు కణతి ఉందని గుర్తించి సర్జరీ చేసి తీసేశారు. హాస్పిటల్ ఎండీ సాయి కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో వైద్యులు సర్జరీలో పాల్గొన్నారు.

స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

బోధన్‌రూరల్(బోధన్) : బోధన్ పట్టణ శివారులో ఇంటి స్థలాల మంజూరు కోసం అర్హులైన పేదలు (బోధన్ పట్టణానికి చెందిన వారు మాత్రమే) ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ వరప్రసాద్ సోమవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు దారులు దరఖాస్తు ఫారం, మొత్తం కుటుంబసభ్యుల ఆధార్ కార్డులు జిరాక్స్‌లు, ఆహారభద్రత కార్డు జిరాక్స్, లబ్ధిదారుల పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, కుల ధృవీకరణ పత్రం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో అందచేయాలన్నారు.

పేద విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకం



డొంకేశ్వర్(ఆర్మూర్) : ప్రతిభ కనబరిచిన పేదల విద్యార్థినులకు రాకేశ్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. డొంకేశ్వర్ మండలంలోని దత్తాపూర్‌కు చెందిన భవానీ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదివి 10 జీపీఏ సాధించింది. ఇదే గ్రామానికి చెందిన ఎం లావణ్య కిక్ బాక్సింగ్‌లో బంగారు పతకం సాధించింది. ఈ ఇద్దరు విద్యార్థినులను సన్మానించి రూ. 10వేల చొప్పున నగదును అందించారు.

విద్యార్థికి..



మాక్లూర్ : పదోతరగతిలో 9.8 మార్కులు సాధించిన ధీకంపల్లి గ్రామం ఓంకార్‌కు సోమవారం రాకేష్‌రెడ్డి ఫౌండేషన్ డైరెక్టర్ సుచరితరెడ్డి రూ.10 వేలను ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. అనంతరం శాలువాతో సన్మానించారు. ఓంకార్ మండలంలోని కల్లెడి ప్రభుత్వ పాఠశాలలో చదివి 10వ తరగతిలో 9.8 మార్కులు సాధించారు. కార్యక్రమంలో మల్లేష్, లింగారెడ్డి, సురేష్‌రెడ్డి గ్రామ పెద్దలు ఉన్నారు.

కానిస్టేబుళ్లకు సన్మానం



బోధన్ రూరల్ (బోధన్) : బోధన్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న కానిస్టేబుల్స్ చిన్నయ్య, చంద్రశేఖర్, ఆనంద్ గౌడ్, సురేష్ బోధన్ రూరల్ సీఐ శ్రీనివాస్ రాజ్, ఎస్సై సందీప్ ఘనంగా సన్మానించారు. బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో వీరు ఐదేళ్లుగా విధులు నిర్వహించారు.

వాటర్ ప్లాంట్లను తనిఖీ చేయాలి

వర్ని : మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో అనుమతులు లేకుండా విచ్చలవిడిగా వెలుస్తున్న ఫిల్టర్ వాటర్ ప్లాంట్‌లపై సంబంధిత అధికారులు వెంటనే తనిఖీలు చేపట్టాలని సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు సాయిబాబు, శివకుమార్ లతో కలిసి సోమవారం వర్ని తహసీల్దార్ విఠల్‌కు వినతి పత్రం అందజేశారు.

నేడు వర్నికి స్పీకర్ రాక

వర్ని: ఈనెల 13వ తేదీన వర్ని మండల కేంద్రంలో నిర్వహించే మహిళా దినోత్సవం కార్యక్రమానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరుకానున్నట్లు వర్ని ఎంపీపీ మేక శ్రీలక్ష్మి వీర్రాజు వెల్లడించారు.

గంగమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన

రుద్రూర్ : రుద్రూర్ మండలం చిక్కడపల్లి గ్రామ చెరువు వద్ద నూతనంగా నిర్మించిన గంగమ్మదేవి ఆలయంలో సోమవారం విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హోమం నిర్వహించారు. మహిళలు బోనాలతో వెళ్లి నైవేద్యం సమర్పించారు. చెరువులో తెప్పలు వదిలి పూజలు నిర్వహించారు.



గ్రూప్‌-1 హాల్‌టికెట్ జారీ అవాస్తవం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌కు చెంది సుచిత్ర గ్రూప్‌–1కు దరఖాస్తు చేసుకోకున్నా హాల్‌టికెట్ జారీ అయిందని ఇటీవల వివిధ మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. కాగా టీఎస్‌పీఎస్‌సీ అధికారులు దీనిపై విచారణ చేపట్టగా అది అవాస్తమని తేల్చారు. గతంలో గ్రూప్‌–1 ప్రిలిమ్స్‌కు దరఖాస్తు చేసి ఆక్టోబర్‌లో గ్రూప్‌–1 ప్రిలిమ్స్ రాసినట్లు అధికారులు స్పష్టం చేశారు.

దళితబంధుతో ఎస్సీ కులాల అభివృద్ధి

ఆర్మూర్ : భారతదేశం మొత్తంలో దళితుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా దళితబంధు అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లోని ఆయన నివాసంలో నందిపేటకు చెందిన మాదిగ సంఘం నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి వారికి గులాబి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాదిగ సంఘం భవన నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేశారు. అనంతరం వారినుద్దేశించి మాట్లా డుతూ స్వతంత్ర భారతంలో నేటికీ దళితులపై వివక్ష కొనసాగుతుండటాన్ని గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కులాల వారి అభివృద్ధి దిశగా పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

నవీపేట(బోధన్) : నవీపేట మండలంలోని కమలపూర్ గ్రామంలో సోమవారం రైతులకు మద్దతు ధర పెంచినందుకు, ఎరువుల రేట్లు తగ్గించినందుకు పీఎం మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఆంజనేయ రెడ్డి, ఎం.శ్రీనివాస్ రెడ్డి,కె. శ్రీనివాస్‌రెడ్డి. ఆర్.శ్రీనివాస్ రెడ్డి, వాసు, అబ్బురం, వెంకట్రం రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులున్నారు.



పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

జమాఖర్చులపై వాగ్వాదం

మాక్లూర్ : ప్రతి మూణ్నెళ్లకొకసారి జమా, ఖర్చులపై జరిగే సమావేశాల్లో భాగంగా సోమవారం మాక్లూర్ వ్యవసాయ పరపతి సంఘం చైర్ పర్సన్ అధ్యక్షతన జరిగిన సమావేశం వాడీ వేడీగా జరిగినట్లు సమాచారం. సమావేశం ప్రారంభంతోనే సొసైటీ కార్యదర్శి జమా, ఖర్చులను చదివి వినిపించగా చైర్ పర్సన్, వైస్ చైర్మన్ మినహా 11 మంది డైరెక్టర్లకుగాను 10 మంది డైరెక్టర్లు ఒక్కసారిగా లేచి లెక్కలన్నీ తప్పులేనని చైర్‌పర్సన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. అయితే ఈ విషయమపై చైర్‌పర్సన్ కుమారుడు జోక్యం చేసుకోవడంతో 10మంది డైరెక్టర్లు ఆతడిని బయటకు పంపినట్లు తెలిసింది. యాసంగి సీజన్‌కు సంబంధించి చూపిన లెక్కలన్నీ తప్పుడు లెక్కలంటూ ఏ ఒక్క డైరెక్టర్ కూడా సంతకాలు చేయకుండానే సమావేశాన్ని బహిష్కరించినట్లు సమాచారం.

ఆధ్యాత్మికం..

- శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్ టౌన్ : పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని బీఆర్ఎస్ నాయకులు శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో పల్లకీసేవ నిర్వహించారు. అన్నదానం ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి సుమన్, పీపీ గంగారెడ్డి, చిన్నారెడ్డి, కౌన్సిలర్ ఖాందేష్ సంగీత, ఖాందేష్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మృత్యుంజయ హోమం

మాక్లూర్: మండలంలోని వేణుకిషాన్‌నగర్ తండా శివారు నాగారం పోశమ్మ ఆలయంలో సోమవారం ఘనంగా మృతుంజయ హోమం జరిగింది. స్థానిక సర్పంచ్ రమేష్‌నాయక్, గుత్పకు చెందిన విజయ రామారావు, గడ్డి రామారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి హాజరై వారితో కలిసి యజ్ఞం చేశారు. అనంతరం అన్నదానం చేశారు. మూడు రోజులుగా జరిగిన ఈ కార్యక్రమాలకు శివారు గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు.

ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



మాక్లూర్ : మండలంలోని వెంకటాపూర్‌లో నూతనంగా నిర్మించిన దాసాంజనేయ ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభం అయ్యాయి. సర్పంచ్ భవాని రఘు, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి హాజరై గ్రామస్తులతో కలిసి పూజలు చేశారు. ఎమ్మెల్యేను సన్మానించారు. ఆలయ కమిటీ చైర్మన్ జలపతిరావు, సర్పంచ్ భవాని రఘు, గ్రామ కమిటీ సభ్యులు బార్కుంట పోశెట్టి, గంగాధర్, విఠల్ రావు, శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణం కోసం విరాళం అందజేత



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయం కోసం స్థానిక దాత బజాజ్ షోరూం యజమాని బోగ శ్యామ్ రూ. 25 వేలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

112 ప్లాట్లు.. 290 దరఖాస్తులు

- సిర్పూర్, జీజీ నడ్కుడలో మొదలైన మార్కింగ్



డొంకేశ్వర్(ఆర్మూర్) : డొంకేశ్వర్ మండలం సిర్పూర్, జీజీ నడ్కుడ గ్రామాల్లో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీకి రెవెన్యూ అధికారులు కసరత్తు వేగవంతం చేశారు. ప్లాట్ల కోసం సోమవారం సిర్పూర్‌లో ముగ్గుపోసి మార్కింగ్ ప్రక్రియను చేపట్టారు. సిర్పూర్‌లో 35ప్లాట్లకు గాను 87దరఖాస్తులు వచ్చాయి. అలాగే జీజీ నడ్కుడలో 77 ప్లాట్లకు గాను 203 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 112 ప్లాట్లకు 290 దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ రవీందర్ నాయక్ తెలిపారు. వీటిని పరిశీలించి ఉన్నతాధికారులకు పంపనున్నామన్నారు. ప్లాట్లకు మార్కింగ్ చేసి హద్దులు పెట్టిన వారిలో సర్వేయర్ కిషన్ ఉన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	అనంత 11.10, కౌశిక్ శర్మ-1.10 స్పైడర్ మాన్ అక్రాస్ (తెలుగు) - 3.30 మేమ్ ఫేమస్ -6.35 పరేషాన్ -9.45
స్క్రీన్-2 –	ట్రాన్స్‌ఫార్మర్స్ (3డి-తెలుగు)-10.40, 1.35, 4.30, 7.25, 10.20
స్క్రీన్-3 –	టక్కర్ 12.20, 6.30, 9.30 మేమ్ ఫేమస్ 3.20
స్క్రీన్-4 –	అన్‌స్టాపబుల్ 10.35 7.00 ఇంటింటి రామాయణం 4.05 9.35